క్లుప్తంగా

ఘనంగా ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న కాల్‌టెక్స్ కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్: కడప నగరం రహమతుల్లా వీధిలో వెలసిన హజరత్ ఖాజా బందే నవాజ్ చాందిపిరి గుమ్మద్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో కాల్‌టెక్స్ కుటుంబ సభ్యులు హబీబుల్లా, హఫీజుల్లా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం కుష్టి రుటీ వద్దా ఫాతేహ చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇనాయతుల్లా, మాజీ కౌన్సిలర్ ఆర్కేరాయల్, మక్బూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్: కడపలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ మధుమేహం (షుగర్) శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి, దాని పనితీరు తగ్గడం వలన షుగర్‌వ్యాధి వస్తుందన్నారు. మన రక్తంలోకి వచ్చే చెక్కర లేదా గ్లూకోజ్‌ను శక్తిగా మార్చే ప్రక్రియకు ఆటంకం ఎదురైనప్పుడు ఈ సమస్య బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు వైద్యులను సలహాలు సూచనలు పాటిస్తూ మధుమేహం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మంచి ఆహార అలవాట్లు, వ్యాయామంతో పాటు జాగ్రత్తలు తీసుకుంటే మధుమేహం వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, సయద్‌నూర్, సాహిద్ పఠాన్, గౌతమి, అయేషా, భార్గవి, వైష్ణవి, శిరీష రెడ్డి, మౌలని, సువర్ణతో పాటు మెడికల్ రెప్స్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి వైశాఖ సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం నవనీత వెన్నతో 20వ వార్డు కౌన్సిలర్ నూక నాగేందర్‌రెడ్డి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని వెన్న, డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎమ్మెల్యేగా, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా అత్యధిక మెజారిటీతో గెలవాలని ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేవీఎస్ సత్యనారాయణ, ధర్మకర్త సుంకు కిశోర్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

విద్యను మించిన ఆస్తి లేదు



స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

బద్వేలు అర్బన్ : సమాజంలో విద్యను మించిన ఆస్తి మరొకటి లేదని మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు పేర్కొన్నారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య నెక్స్ జెన్ స్కూల్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమాజం పట్ల బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, సంస్కారం నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, పాఠశాల చైర్మన్ చెన్నుపల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, డైరెక్టర్ బోగేంద్రనాథ్‌రెడ్డి, కె.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

• మురిపించిన మువ్వల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో నగరవాసులు ఎండల్లో ఆటవిడుపుగా సాయంత్రం చల్లగాలిని ఆస్వాదించేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. బద్వేలుకు చెందిన అనూష డ్యాన్స్ అకాడమి చిన్నారులు ఈ సందర్భంగా పలు సరికొత్త గీతాలకు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. వారు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. –కడప కల్చరల్



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రేక్షకులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

రక్తదానం ప్రాణదానంతో సమానం



చర్చ్ ఆఫ్ గాడ్ సభ్యులతో మెడికల్ సూపరింటెండెంట్ డా. జీవీ రమాదేవి తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్) ఐపీ విభాగంలో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.1466వ వరల్డ్ వైడ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ నేతృత్వంలో సంఘ సభ్యులు, 40 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ సూపరింటెండెంట్ డా. జీవీ రమాదేవి, ఆర్ఎంఓ డా. వై.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది మాధురి లత, శ్రీకాంత్, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆర్గనైజర్ జి.ఎబినేజర్ పాల్గొన్నారు.

కేజీ పీజీ సెట్– 2కే24 ఫలితాలు విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న కందుల రాజేశ్వరి, కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కందుల విద్యాసంస్థల్లో ఇటీవల ఎంబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించిన కేజీ పీజీ సెట్ – 2కే24 ఫలితాలను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కేజీ పీజీ సెట్‌ను తమ విద్యా సంస్థల్లో నిర్వహించడం ఇది రెండవసారి అని తెలిపారు. ఈ పరీక్షల్లో 169 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 159 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిలో మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలలో ఉచిత విద్యతో పాటు వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఏ స్.ఎస్.మూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌ప్రసాద్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ నాగమణి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



అట్లూరు : గొడుగునూరులో మట్లాడుతున్న పోలీస్ అధికారులు



రాజుపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగమురళి

అట్లూరు : జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు రూరల్ సీఐ విక్రమ సింహా, స్థానిక ఎస్ఐ కేసీ రాజు, బద్వేలు రూరల్ ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు రూరల్ మండల పరిధిలోని గొడుగునూరు, పుట్టాయిపల్లి గ్రామాలలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వీధులలో కలియ తిరిగి, వరిగడ్డివాములలో అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. అయా గ్రామాలలోని ప్రజలతో వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం బాణాసంచాలు పేల్చడం, అల్లర్లు సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బద్వేలు రూరల్, అట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించకండి

కలసపాడు : ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ నాగమురళి, కాశినాయన ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో నాకాబందీ, కవాతు, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున వరకు గానీ, కౌంటింగ్ రోజు, కౌంటింగ్ తదుపరి రోజుల్లో గానీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వరాదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అక్రమ మద్యం, మందుగుండు కాల్చినా.. విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

బ్రహ్మంగారిమఠం : జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పార్టీలపై అభిమానం ఉన్న వారు పోలీస్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులకు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎక్కడో కౌంటింగ్ జరుగుతుంటే గ్రామాల్లో సంబరాలు చేసుకున్నా, ఇతర పార్టీల వారితో అతిగా మాట్లాడినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ర్యాలీలు, సంబరాలు జరుపుకోవద్దు అన్నారు. అలా ఎవరైనా జరుపుకొన్నా, గ్రామాల్లో ఘర్షణకు దిగినా పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు.

మానవత ద్వారా మరింత చేయూత



ఫారెస్టు బీట్ అధికారి మధును సత్కరిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సమాజంలో ఉన్న అభాగ్యులకు, నిస్సహాయులకు మరింత చేయూత లభించడం హర్షణీయమని ఫారెస్టు బీట్ అధికారి ఏ. మధు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మాసాంతర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి తరంలో ఎంతోమంది నిస్సహాయస్థితిలో ఉన్నారని, అనాథలుగా బతుకుతున్నారని, వారికి మేము సైతం అంటూ మానవత అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగిండాలన్నారు. మానవ సేవే మాధవ సేవగా నమ్మిన సేవకులంతా ఆదర్శంగా ముందుకెళ్లి.. భావితరాలకు మార్గదర్శకులు కావాలని కోరారు. అలాగే మానవత ద్వారా అందుతున్న వివిధ సేవ కార్యక్రమాలు ప్రశంసనియమన్నారు. భవిష్యత్తులో కూడా అదేతరహగా సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు చల్లా బాలాజీ, డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాభారతంపై అవగాహన

చాపాడు : ఈ తరం విద్యార్థులకు మహా భారతంపై అవగాహన కల్పించటం అవసరమని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహా భారతంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మనిషి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మహా భారతంపై అవగాహన కల్పించారు. అందులోని నీతి, ధర్మం, మంచి తనం వంటి గొప్ప అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియజేశారు. జూన్ 7వ తేదీ వరకూ వేసవి శిక్షణా తరగతులు ఉంటాయని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు.

భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని కైవల్య తీర్థస్వామి పేర్కొన్నారు. స్థానిక లైటుపాళెం సెంటర్‌లోని శ్రీ కైవల్య సత్సంగ్ ఎంవీఎస్ ధ్యాన మందిరంలో భగవద్గీతలోని 17వ అధ్యాయం శ్రద్ధ త్రయ విభాగ యోగంపై ఉచిత శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడం వల్ల మంచి, చెడు తెలుస్తుందని, పరిపూర్ణ మానవుడిగా జీవించవచ్చన్నారు. 14 ఏళ్లుగా ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అలరించిన సాంస్కృతికాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించారు. కడప జిల్లా కిషోర్ డ్యాన్స్ అకాడమి మాస్టర్ కిషోర్ కళాబృందం చిన్నారులచే జానపద, శాస్త్రీయ నృత్యాలతోపాటు సినీ గీతాలకు నృత్యాలు నిర్వహించి సందర్శకులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భాస్కరశెట్టి (75) మృతి చెందారు. స్థానిక చెన్నారెడ్డి కాలనీలో నివసిస్తున్న ఆయన పులివెందుల జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా 40 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పులివెందులలో న్యాయవాదులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

వర్షం కోసం యాగం

తొండూరు : మండల పరిధిలోని ఇనగనూరు గ్రామంలో శ్రీ ఎరుకుల నాంచారమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ ఇనగనూరు ఎంపీటీసీ యాడికి సావిత్రమ్మ, ప్రధాన కార్యదర్శి దశరథరామిరెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఈఏడాది వానలు బాగా పడాలని ఆలయంలో యాగం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కడప కల్చరల్ : ప్రతిభగల తొగట వీర క్షత్రియ విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. 2023 –2024 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన తొగట వీర క్షత్రియ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభకు «పట్టాభిషేకం» పేరిట ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కల్యా సుధాకర్, కోశాధికారి టేకూరి సుదర్శన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు సుంకర రామచంద్రుడు, కార్యనిర్వహణ కార్యదర్శి పల్లా మురళి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో నూతనోత్సాహాన్ని కల్పించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 520 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి నగదు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కడప నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివి 500 పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 23న ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. పదవ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను జూన్ 9వ తేదీ లోపు కల్యా సుధాకర్, డోర్ నెంబర్ 1/1376, శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం ఎదురుగా, బియ్యం అంగడి, ఎర్రముక్కపల్లి, కడప చిరునామాకు పంపాలని సూచించారు.

జాతరలతో బలపడనున్న బంధుత్వాలు



తుమ్మలపల్లెలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : తిరునాళ్లు, జాతరలు తదితర కార్యక్రమాల వల్ల పాత బంధువులు, స్నేహితులతో సత్సంబంధాలు పెరిగి బంధాలు, బంధుత్వాలు బలపడతాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో శ్రీకోదండరాముని విగ్రహ ప్రతిష్ట జరిగి మండల పూజ సందర్భంగా జాతర ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్సీని ఆహ్వానించారు. ఈ మేరకు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్థానిక నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన వారి వారి బంధువులను చూసి ఇలాంటి కార్యక్రమాల వల్ల పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతోపాటు బంధాలు, బంధుత్వాలు, స్నేహ సంబంధాలు మెరుగుపడటంతో పాటు గ్రామంలోని గ్రామస్తులు కూడా స్నేహ సంబంధాలతో ఉండే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేషారెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, వీరకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, బద్వేలు జెడ్పీటీసీ వంకెలపోలిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కథ రచన, పద్య పఠన పోటీలు



కథ రచన పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తినారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు ఆదివారం కథ రచన, పద్య పఠన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు, పద్యాలతో విజ్ఞానం, వినోదం అందిస్తూ ఆటలు, పాటలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఎంతో ఆసక్తితో విద్యార్థులు కథ రచన, పద్య పఠన పోటీల్లో పాల్గొన్నారన్నారు. భవిష్యత్తులో రచయితలుగా రాణించాలని సూచించారు. అనంతరం గంగాధర్‌రెడ్డి విద్యార్థులచే జిరాఫీ చెస్ ఆడించారు. స్పోకెన్ ఇంగ్లిషు మాస్టర్ పవన్ కళ్యాణ్ విద్యార్థులచేత ఇంగ్లీషు కాన్వర్జేషన్ ప్రాక్టీస్ చేయించారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ హెల్పర్ నాగలక్ష్మి, మునిశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర



పోలేరమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధి కాపువీధి, బెస్తవీధి, అమ్మవారిశాలవీధి కూడలిలోని సత్యమ్మతల్లి, అబ్బరాతివీధిలోని పోలేరమ్మ ఆలయాల్లో జాతర సందర్భంగా ఆదివారం చల్ల (బోనాలు) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆయా ఆలయాలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి సత్యమ్మతల్లికి, పోలేరమ్మకు బోనాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతోపాటు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో విరజిల్లాలని కోరుతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు సహకరించాలి

వల్లూరు : జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కమలాపురం నియోజకవర్గ నోడల్ డీఎస్పీ ఎన్.సుధాకర్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. కౌంటింగ్‌కు ముందు రోజైన 3వ తేదీన మండల పరిధిలోని ఫంక్షన్ హాల్లను మూసి వేయాలని, ఇళ్లలో బస చేసిన ఇతర ప్రాంతాలకు చెందిన వారు వారి స్వంతం ఊర్లకు వెళ్లిపోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి స్థానికేతరులకు తమ ఫంక్షన్ హాల్లలో, ఇళ్లలో ఆశ్రయం కల్పించినట్లు తెలిస్తే ఆయా యాజమాన్యాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న మండలంలోని హోటళ్లను మూసివేయాలన్నారు.

నదీ ప్రవాహం లాంటి 'పెన్నేటి కథలు'

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'నెలనెలా సీమ సాహిత్యం' పై సదస్సు
రాయలసీమ నదీ సాహిత్యంపై చర్చ



మాట్లాడుతున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి

కడప కల్చరల్ : పి.రామకృష్ణారెడ్డి రచించిన పెన్నేటి కథల్లో నదీ ప్రవాహం లాంటి జీవితాల చిత్రణ ఉందని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. ఎన్నో మలుపులతో నదీమ తల్లి గమ్యానికి చేరుకుంటుందని, జీవితం కూడా ఎన్నో మలుపులు, మిట్ట పల్లాలను దాటుకుని జీవిత గమ్యానికి చేరుకుంటుందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 132వ సదస్సు నిర్వహించారు. 'రాయలసీమ నదీ సాహిత్యం' అనే అంశంపై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నది పరీవాహక ప్రాంతాల భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థికాంశాలతో కూడిన మనిషి జీవిత చిత్రణే నదీ సాహిత్యమన్నారు. విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట', పి.రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కథలు' లోని నదీ సాహిత్యాన్ని విశ్లేషించారు. పెన్నేటి పాట చిన్నకావ్యమైనా ప్రాంతీయ అస్తిత్వం దిశగా తెలుగు సాహిత్యంలో చైతన్యం నింపిందన్నారు. రాయలసీమ రైతు కన్నీటిగాథను కరుణ రసాత్మకంగా విద్వాన్ విశ్వం చిత్రించారని కొనియాడారు.

ప్రాంతీయ భాషకు పట్టం

ప్రాంతీయ భాషకు పట్టం కడుతూ పెన్నానది ప్రవహించినప్పుడు ఆనందాన్ని, ఎండినప్పుడు దు:ఖాన్ని మిగిల్చిన జ్ఞాపకాలకు అక్షరరూపాన్ని ఇవ్వడం విశేషమన్నారు. పెన్నేటి కథల రచయిత రామకృష్ణారెడ్డి పోట్లదుర్తి వద్ద పెన్నా ఒడ్డునగల హనుమనగుత్తి గ్రామ వాసి తెలిపారు. వ్యవసాయం తీరు తెన్నులు, రైతులు కూలీలుగా మారి వలస పోవడం, అతివృష్టి, అనావృష్టితో పంట నష్టపోవడం, పశువులకు, రైతులకుమధ్యఆత్మీయ అనుబంధాన్ని ఆయన తన కథల్లో చిత్రించారని కొన్ని కథలను ఉదహరించారు. పాలగిరి విశ్వప్రసాదరెడ్డి రచన 'చుక్క పొడిచింది', శాంతి నారాయణ రాసిన 'పెన్నేటి మలుపులు', డాక్టర్ వేంపల్లి గంగాధర్ రచన 'పాపాగ్ని కథలు', బత్తుల ప్రసాద్ 'సగిలేటి కథలు' తదితర రచనలను పెన్నానదీ సాహిత్యంలో అంతర్భాగంగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ చింతకుంట శివారెడ్డిని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, సాహితీవేత్తలు సన్మానించారు. యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, గానుగపెంట హనుమంతరావు, పుత్తా పుల్లారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, రాజారెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్, చంద్రశేఖర రెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, నారాయణ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, బాలయల్లారెడ్డి, స్వరూపరాణి, రామమోహన్ రెడ్డి ,రెడ్డయ్య, గంగయ్య పాల్గొన్నారు.